



EVENING EDITION

నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
13-12-2025
పేజీలు: 02




## 70 అడుగుల మెస్సి విగ్రహం ఆవిష్కరణ

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం మెస్సి కోల్‌కతాకు చేరుకున్నాడు. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తాజాగా కోల్‌కతాలో 70 అడుగుల మెస్సి విగ్రహావిష్కరణ జరిగింది. ఉదయం లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అతడు అక్కడికి వెళ్లలేకపోయాడు. తర్వాత సాల్‌ట్‌లేక్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీలను కలుస్తాడు. శనివారం కోల్‌కతాలో కార్యక్రమం ముగియగానే మెస్సి హైదరాబాద్ బయలుదేరతాడు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటాడు. ఆ తర్వాత గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆడతాడు. ఉప్పల్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఆడతారు.

### విగ్రహంపై మెస్సి సంతోషం..

తన 70 అడుగుల భారీ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు పశ్చిమ బెంగాల్ మంత్రి, శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు సుజిత్ బోస్ తెలిపారు. ఈ 70 అడుగుల విగ్రహం ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిఫా వరల్‌డ్‌కప్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. 'మేం మెస్సి మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఈ విగ్రహ నిర్మాణానికి మెస్సి యాజమాన్యం ముందు అనుమతి ఇచ్చింది. ఈ విగ్రహంపై మెస్సి ఎంతో సంతృప్తిగా ఉన్నాడు. ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. 70 అడుగుల ఎత్తుతో ఇంత భారీ మెస్సీ విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ నిర్మాణాన్ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశాం. కోల్‌కతాకు మెస్సీ వస్తుండటంతో అభిమానుల్లో అపూర్వమైన ఉత్సాహం నెలకొంది' మంత్రి సుజిత్ బోస్ అన్నారు.

# మోగ్లీ రివ్యూ



యంగ్ హీరో రోషన్ కనకాల అలాగే సోషల్ మీడియా సెన్సేషన్ బండి సరోజ్ లతో కలర్ ఫోటో దర్శకుడు సందీప్ రాజ్ తెరకెక్కించిన సినిమా "మోగ్లీ 2025" కూడా ఒకటి. మరి ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం. పార్వతీపురం అనే ఒక కొండ ప్రాంతపు చిన్న గ్రామంలో మురళీ కృష్ణ అక్కడి ప్రజలు మోగ్లీ (రోషన్ కార్తీక్ కనకాల) గా పిలవబడే కుర్రాడు ఎప్పటికైనా పోలీస్ కావాలని కలలు కంటాడు. చిన్నతనంలోనే అమ్మానాన్నలని కోల్పోయిన తాను తన ఊరివారి లోనే తన కుటుంబాన్ని చూసుకుంటాడు. ఇదిలా ఉంటే ఆ ఊరిలో ఓ సినిమా షూటింగ్ కోసం వచ్చిన ఒక మూగ, చెవిటి అమ్మాయి వర్ష అలియాస్ జాస్మిన్ (సాక్షి) ని తొలి చూపులోనే ప్రేమిస్తాడు. ఇలా వీరి లవ్ ట్రాక్ లోకి స్త్రీ వ్యామోహం ఉన్న క్రూరమైన పోలీస్ ఆఫీసర్ క్రిస్టోఫర్ నోలన్ (బండి సరోజ్ కుమార్) వచ్చాక ఏమైంది? మోగ్లీ ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? కోల్పోయింది ఏంటి? చివరికి తన ప్రేమ గెలిచిందా లేదా అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూడాలి.ఈ సినిమాలో నలుగురు మెయిన్ పాత్రధారులు సాలిడ్ నటన కనబరిచారు అని చెప్పాలి. ముందుగా రోషన్ కార్తీక్ కనకాల విషయానికి వస్తే తాను ఈ సినిమాలో నటుడిగా చాలా చక్కని హావ భావాలు పలికించాడు అని చెప్పవచ్చు. ముఖ్యంగా మోగ్లీ అనే అడవి కుర్రాడి పాత్రలో తాను ఇమిడిపోయాడు. ఆ పాత్రలోని ఒక అమాయకత్వాన్ని తన ముఖ కవళికలలో చాలా బాగా చూపించాడు. ఈ ఎమోషన్ మాత్రం రోషన్ లోని నటుడుని బాగా చూపించింది. అలాగే యంగ్ హీరోయిన్ సాక్షి మహాదోల్కార్ కూడా బాగా చేసింది. తనకిచ్చిన ప్రత్యేక పాత్రలో ఆమె బాగా చేసింది. రోషన్ తో కూడా ఆమె కెమిస్ట్రీ బాగుంది. ఇక నటుడు పబ్లిక్ స్టార్ బండి సరోజ్ కూడా ఏమాత్రం తగ్గలేదు. తన పాత్ర డిజైన్ గాని ఆ పాత్రలో తానే ఎందుకు అనే అంశం ఈ సినిమాలో తాను పర్ఫెక్ట్ గా చేసి చూపించారు. తనలో ఆల్రెడీ నెగిటివ్ షేడ్ చాలా మంది చూసి ఉండొచ్చు కానీ ఇందులో నెగిటివ్ షేడ్ కూడా సాలిడ్ గా వర్కౌట్ అయ్యింది. తన ఇంట్రో గాని సెకండాఫ్ లో తన స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ చాలా బాగున్నాయి. ఇక వీరి అందరితో పాటుగా వైవా హర్షకి మంచి రోల్ పడింది. అక్కడక్కడా కామెడీ సీన్స్ ఇంకా ఎమోషనల్ గా కూడా తనపై కొన్ని సీన్స్ బాగున్నాయి. అలాగే తనపై ఫస్టాఫ్ లో ఓ సీక్వెన్స్ ప్రభాస్ ఫ్యాన్స్ కి మంచి సర్ప్రైజింగ్ గా అనిపించవచ్చు. ఇక వీరితో పాటుగా ఇతర నటీనటులు అంతా బాగా చేశారు. ఈ సినిమాలో మెయిన్ సమస్య ఎక్కడ వచ్చింది అంటే దర్శకుడు చెప్పాలనుకున్న పాయింట్ ని బాగా సాగదీతగా తీసుకెళ్తూ చెప్పడం జరిగింది. హీరో, హీరోయిన్ ట్రాక్ లని అనవసరంగా సాగదీసినట్టుగా ఉంటుంది. మొదటి కొన్ని నిమిషాల ఎస్టాబ్లిష్మెంట్ డీసెంట్ గా అనిపిస్తుంది కానీ నెమ్మదిగా పరిస్థితులు ఇంట్రెస్ట్ లేకుండా చాలా రొటీన్ అండ్ సాగదీతగా వెళతాయి. ఇక ఇదే పంథా సెకండాఫ్ లో కూడా సాగుతుంది. సెకండాఫ్ లో బండి సరోజ్ పై కొన్ని సీన్స్ బానే లాక్కొచ్చారు కానీ మిగతా సీన్స్ మాత్రం ఎప్పుడో చూసేసిన నిజం, నువ్వు నేను లాంటి తేజ సినిమాలను ఆడియెన్స్ కి గుర్తు చేసేలా కనిపిస్తాయి. అలాగే నటుడు సుహాస్ పోర్షన్ కూడా అంత కిక్ ఏమీ ఇందులో ఇవ్వలేదు. ఐకాన్ స్టార్ ని ఇమిటేట్ చేస్తూ ట్రై చేసిన పోర్షన్స్ నాచురల్ గా అనిపించలేదు. అలాగే వీటితో పాటుగా రోషన్ ఇంకా తన నటనపై దృష్టి పెట్టాల్సి ఉంది. తనలోని ఇన్నోసెన్స్ ని చాలా బాగా చూపించిన తాను కొన్ని ఎమోషనల్ సీన్స్ లో తనని తాను కంట్రోల్ చేసుకుంటున్నట్టుగా కనిపిస్తుంది. దానివల్ల ఇంపాక్ట్ కొంచెం తగ్గింది. దీనిని తాను అధిగమిస్తే ఫ్యూచర్ లో తనలో మరింత మంచి నటుణ్ని చూడొచ్చు. ఈ సినిమాలో నిర్మాణ విలువలు బాగున్నాయి. దాదాపు సినిమాని రియల్ లొకేషన్స్ లోనే చిత్రీకరించడం విశేషం. సీన్ టు సీన్ మంచి ట్రాన్సిక్షన్స్ ఫస్టాఫ్ లో కనిపిస్తాయి. వి ఎఫ్ ఎక్స్ కూడా డీసెంట్ గా ఉన్నాయి. కాల భైరవ సంగీతం బాగుంది. ఎడిటింగ్ ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు సందీప్ రాజ్ విషయానికి వస్తే.. తాను ఈ సినిమాకి కలర్ ఫోటో రేంజ్ లో ట్రీట్మెంట్ ఇద్దామనుకునే ప్రయత్నం చేశారు కానీ అందులో అంత ఇంపాక్ట్ కలిగించలేకపోయారు. ప్రధాన పాత్రలు నుంచి మంచి నటన అయితే తాను రాబట్టగలిగారు కానీ సినిమాలో మెయిన్ పాయింట్ కోసం మిగతా కథనం సాగదీతగా లాగుతూ తీసుకెళ్లారు. కొన్ని సీన్స్ ని తగ్గించి మరింత గ్రిప్పింగ్ గా కథనాన్ని డిజైన్ చేసుకోవాల్సింది అలాగే సెకండాఫ్ లో లీడ్ జంటపై సీన్స్ ని మరో వెర్షన్ ని ట్రై చేయాల్సింది అవన్నీ తేజ సినిమాల్లో చూసినట్టే ఉంటాయి సో కొత్తదనం మిస్ అయ్యింది. ఇక మొత్తంగా చూసినట్లయితే ఈ 'మోగ్లీ 2025' లో రోషన్ ప్రామిసింగ్ పెర్ఫామెన్స్ ని అందించాడు. తన పాత్రలోని ఇన్నోసెన్స్ ని చాలా బాగా ప్రదర్శించాడు. అలాగే బండి సరోజ్ కి కూడా మంచి రోల్ పడింది దానిని తాను కూడా బాగా పండించారు. కొన్ని కొన్ని సీన్స్ అక్కడక్కడా పర్వాలేదు అనిపిస్తాయి బలమైన కథనం.

## పిల్లల పాలిట పాయిజన్ 2047గా మారిన రేవంత్ రెడ్డి: హరీశ్ రావు



రేవంత్ రెడ్డి పిల్లల పాలిట 'పాయిజన్ 2047'గా మారాడని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పేద పిల్లల మీద ముఖ్యమంత్రి పగబట్టాడు. రెండేండ్లలో 116 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నాడని చెప్పారు. ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా రేవంత్ రెడ్డికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ రెండేండ్ల పాలనలో స్కూలు విద్యార్థులకు కనీసం పట్టెడన్నం పెట్టలేక పోతున్నావని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడని దుయ్యబట్టారు. ఫుడ్ పాయిజన్ బారిన పడి హైదరాబాద్ కింగ్ కోఠి దవాఖానలో చికిత్స పొందుతున్న బాగ్ లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ కలిసి హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని హాస్పిటల్ పాలవుతున్నారు. మొన్న షామీర్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లే పరిస్థితి వచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విద్యార్థులే ఫిర్యాదు చేశారు. నిన్న మాదాపూర్‌లోని చందునాయక్ తండాలో మధ్యాహ్న భోజనం వికటించి 43 మంది పిల్లలు దవాఖానలో చేరారు. ఇప్పుడు ముషీరాబాద్ నియోజకవర్గంలో బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకులంలో కలుషిత ఆహారం తిని 90 మంది ఆసుపత్రి పాలయ్యారు. రేవంత్ రెడ్డి విజన్ 2047 అని డబ్బా కొట్టుకుంటున్నాడు. ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047గా మారింది. రేవంత్ రెడ్డి పిల్లల పాలిట పాయిజన్ 2047గా మారిండు. నీకు నిజాయితీ ఉంటే గురుకులాల్లోని పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు తిరిగి మళ్లీ హాస్టల్‌కి వెళ్ళము అని భయపడి చెబుతున్నారు.

## పవన్ సార్ సీఎం అవ్వాలన్నదే నా కల..
## భారత అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్‌ను చూడటమే నా కల.. ఇలాంటి లీడర్ మన దేశానికి ఉండాలి.. అంటూ భారత అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక పేర్కొన్నారు. ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో పవన్ కల్యాణ్ ఆప్యాయంగా మాట్లాడారు.. ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. అనంతరం దీపిక వార్తా సంస్థ పీటీఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా.. భారత అంధ మహిళల క్రికెట్ జట్టు.. టీ20 ప్రపంచ కప్ విజయం వెనుక ఉన్న ప్రయాణం గురించి కెప్టెన్ దీపిక వివరించారు. కర్ణాటక — ఆంధ్రప్రదేశ్ నుండి తనకు లభించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక-ఆంధ్ర సరిహద్దులోని సత్యసాయి జిల్లా, తంబలహట్టి గ్రామానికి చెందిన దీపిక, జట్టుకు తన ఎంపిక కర్ణాటక ద్వారా జరిగిందని, ఒక క్రికెటర్‌గా తన ఎదుగుదలలో ఈ రెండు రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. "ఆ మద్దతుతోనే మేము ప్రపంచకప్ గెలవగలిగాము, భారతదేశానికి, మా గ్రామానికి, మా రాష్ట్రానికి గుర్తింపు తీసుకురాగలిగాము" అని ఆమె అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలవడం చాలా సంతోషకరమని.. ఆయనతో మాట్లాడటం.. తన నాన్నతో మాట్లాడినట్లే ఉందని దీపిక చెప్పుకొచ్చారు.



ఏఐ జనరేట్ ఫోటో

## శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు

మహిళల శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఆ డైట్ అస్సలు పాటించకండి

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది.తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది.



## డిసెంబర్ 19 నుంచి
# ఓటీటీలోకి రాజు వెడ్స్ రాంబాయి




తెలంగాణ ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన రూరల్ లవ్ స్టోరీ 'రాజు వెడ్స్ రాంబాయి' థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. కొత్త దర్శకుడు సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో–హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే తొలి సినిమా అయినప్పటికీ, తమ సహజ నటనతో ప్రేక్షకుల హృదయాలను తాకి కన్నీళ్లు పెట్టించారు. ఈ సినిమాలో సిద్దు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ విలన్ పాత్రలో నటించి ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించాడు. అతడి నటన ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలిచింది. నవంబర్ 21న విడుదలైన ఈ చిత్రం మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని, బాక్సాఫీస్ వద్ద అంచనాలను మించి వసూళ్లు సాధించింది. చాలా తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రూ.17 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి నిర్మాతలకు భారీ లాభాలు అందించింది. థియేటర్లలో ఘన విజయం సాధించిన తర్వాత, ఈ సినిమాను ఓటీటీలో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది. 'రాజు వెడ్స్ రాంబాయి' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్‌కు రానున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# మెగా అభిమానులకు డబుల్ ధమాకా




మెగా అభిమానులకు నేడు నిజంగా(డిసెంబర్ 13) పండగ వాతావరణం నెలకొంది. మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భారీ చిత్రాల నుంచి ఒకే రోజు కీలక అప్‌డేట్స్ రాబోతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం పతాక స్థాయికి చేరింది. ఈ రెండు సర్‌ప్రైజ్‌ల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సంక్రాంతి 2026 రిలీజ్ లక్ష్యంగా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా రిలీజ్ డేట్‌ను చిత్ర యూనిట్ నేడు అధికారికంగా ప్రకటించనుంది. సాయంత్రం 5 గంటలకు జరగనున్న గ్రాండ్ ప్రెస్ మీట్‌లో ఈ డేట్‌ను వెల్లడించనున్నారు. అలాగే ఈ చిత్రం నుంచి ఇది తొలి అవుట్‌డోర్ ప్రమోషనల్ కార్యక్రమం కావడం విశేషం.

# జయశంకర్ భూపాలపల్లిలో దారుణ ఘటన

భార్యా, భర్తల మధ్య అనుబంధాలు నీటి బుడగలా మారిపోతున్నాయి. కడదాకా కలిసుంటామని ప్రమాణం చేసి పెళ్లి చేసుకుంటున్న జంటలు చిన్న కారణాలతో విడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎంతో గుట్టుగా సాగించాల్సిన సంసారాలను నడి బజార్లో పెడుతున్నారు. అంతేకాకుండా క్షణికావేశాలతో, వివాహేతర సంబంధాలు, ఇతరత్రా కారణాల వల్ల తమ భాగస్వాములను కడతేరుస్తున్న సంఘటనలు ఎన్నో. జీవితాంతం తోడుంటామని చెప్పిన వారే అకారణంగా భార్యా/భర్తల ప్రాణాలను తీస్తున్నారు. నూరేళ్ల జీవితాన్ని అంతం చేసుకుంటున్నారు. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. కట్టుకున్న భార్యను కడతేర్చాడో భర్త. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని గణపురం మండలం సీతారాంపురం గ్రామంలో దారుణం జరిగింది. భార్య సంధ్య (42)ను తాడుతో ఉరివేసి చంపి ఆపై తాను కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు భర్త బాలరాజు రామాచారి (50). సంధ్య, బాలరాజు రామాచారి భార్యా భర్తలు. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే బాలరాజును భార్య, కూతురు కలిసి వేధింపులకు గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వారిద్దరి వేధింపులకు తాళలేక భర్త బాలరాజు కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్యను ఉరివేసి హత్య చేశాడు.

# రైతుల ఇష్యూపై కేంద్రమంత్రి పెమ్మసాని క్లారిటీ

అమరావతి రైతులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల సమావేశం అయ్యారు. ఈ మీటింగులో జరిగిన చిన్న ఇష్యూపై క్లారిటీ ఇచ్చారు. ఈ ఇష్యూ జరగడానికి గల కారణాలపై ఇవాళ(శనివారం) మీడియాతో మాట్లాడారు పెమ్మసాని. అన్నదాతలతో సమావేశం ప్రారంభించే ముందు కొన్నిసూచనలు చేశానని ప్రస్తావించారు పెమ్మసాని చంద్రశేఖర్. సీరియస్ విషయంపై చర్చ జరుగుతోందని.. ప్రశాంతంగా ఉండాలని.. ఎవరూ అనవసరంగా డిస్టర్బ్ చేయొద్దని తాను మూడుసార్లు చెప్పానని గుర్తుచేశారు. సీరియస్ ఇష్యూ జరుగుతుంటే.. యూట్యూబ్ వీడియోలు, ఫోన్‌లో మాట్లాడవద్దని తాను సూచించానని తెలిపారు. కానీ కొంతమంది చెప్పినా పట్టించుకోకపోవడంతో తాను ఇలా చేయొద్దని వారించానని పేర్కొన్నారు. అయినా కొంతమంది యూట్యూబ్ వీడియోలు చూశారని.. వేలమంది రైతులకు సంబంధించిన విషయం చర్చిస్తుంటే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించారు పెమ్మసాని చంద్రశేఖర్.

## తండ్రి ఆటో కిందే పడి కూతురు దుర్మరణం..
# అనకాపల్లిలో విషాదం

మృత్యువు ఏ రూపంలో వస్తుందో ఎవ్వరికీ తెలీదు. అప్పటి వరకు ఆడుతూ పాడుతూ తమ కళ్లముందే ఉన్న వారు హఠాత్తుగా మృత్యుఒడిలోకి వెళుతుంటారు. అనుకోని ప్రమాదాల బారిన పడి ఎంతో మంది ప్రాణాలు విడుస్తుంటారు. అయితే కళ్లెదుట అయిన వారు ప్రాణాలు విడిస్తే ఆ బాధ వర్ణణాతీతమనే చెప్పకోవాలి. ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతున్న ఆత్మీయులను కాపాడుకోలేక వారు నరకయాతన అనుభవిస్తారు. ఇలాంటి ఘటనే అనకాపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. తండ్రి కళ్ల ముందరే కుమార్తె ప్రాణాలు విడిచింది. తన ముందే కన్నబిడ్డ అలా చనిపోవడంతో ఆ తండ్రి కుప్పకూలిపోయాడు. వివరాల్లోకి వెళితే..అనకాపల్లి జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. సునీత అనే (18) యువతి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. అది కూడా తండ్రి ఆటో కింద పడి ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈరోజు టెట్ పరీక్ష కోసం స్వయంగా తండ్రి ఆటోలోనే పరీక్షా కేంద్రానికి బయలుదేరింది సునీత. కుమార్తెను ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు సదరు తండ్రి గూగుల్ మ్యాప్ సహాయం తీసుకున్నాడు. అయితే అదే తన కుమార్తెను దూరం చేస్తుందని అతడు ఊహించలేకపోయాడు. గూగుల్ మ్యాప్ చూసుకుంటూ ఆటో నడుపుతుండగా అనకాపల్లి జిల్లా సుంకరమేట్ట వద్ద ఆటో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో సునీత అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. పరీక్ష రాసేందుకు వెళ్తున్న కూతురు.. తన ఆటోకింద పడి ప్రాణాలు వివడవడంతో ఆ తండ్రి గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మెస్సీ కోసం హనీమూన్ వాయిదా



అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత్ చేరుకున్న విషయం తెలిసిందే. గోట్ ఇండియా టూరులో భాగంగా మెస్సి .. భారత్‌కు వచ్చాడు. ఇవాళ తెల్లవారుజామున పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ల్యాండ్ అయ్యారు. తమ అభిమాన ఆటగాడిని చూసేందుకు వేలాది మంది అభిమానులు ఎయిర్‌పోర్టు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఫుట్‌బాల్ స్టార్‌కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఓ కొత్త పెళ్లి కూతురు ప్రదర్శించిన ప్లకార్డు అందరి దృష్టిని ఆకర్షించింది. మెస్సీ కోసం తన హనీమూన్‌ను వాయిదా వేసుకున్నానంటూ సదరు నూతన వధువు క్రేజీ ప్లకార్డును ప్రదర్శించింది. ఈనెల 5న వివాహం జరగ్గా.. హనీమూన్ వెళ్లాల్సి ఉంది. అయితే, మెస్సీ వస్తున్నాడన్న విషయం తెలిసి ఈ కొత్త జంట తమ హనీమూన్‌ను క్యాన్సెల్ చేసుకుంది. ఈ విషయాన్ని ప్లకార్డు ద్వారా నూతన వధువు ప్రదర్శించింది. 'జస్ట్ మారీడ్.. మెస్సీని చూసేందుకు హనీమూన్‌ను క్యాన్సెల్ చేసుకున్నాం' అని రాసిఉన్న ప్లకార్డును సదరు మహిళ ప్రదర్శించింది. ఈ ప్లకార్డు అక్కడికి వచ్చినవారి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'గత శుక్రవారం (డిసెంబర్ 5)న మాకు వివాహం జరిగింది. మెస్సీ వస్తున్నాడని తెలిసి మా హనీమూన్‌ను వాయిదా వేసుకున్నాం. 2010 నుంచి ఆయనకు నేను పెద్ద ఫ్యాన్‌ని' అంటూ మీడియాతో తన ఆసక్తిని పంచుకున్నారు కొత్త పెళ్లి కూతురు. ఇందుకు సంబంధించిన దృష్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# మ్యాచ్ ఆడకుండానే వెళ్లిపోయిన మెస్సి..

## ఫ్యాన్స్ ఫైర్.. ఫ్లెక్సీలు చించి, కుర్చీలు విసిరేసి

అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోల్‌కతాలో ఇవాళ ఉదయం ల్యాండ్ అయ్యారు. అనంతరం స్థానిక సాల్ట్ లేక్ స్టేడియం లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మెస్సిని చూసేందుకు కోల్‌కతా సహా పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలివచ్చారు. అయితే, అక్కడ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సి ఆడాల్సి ఉండగా.. ఆడకుండానే స్టేడియం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఫ్యాన్స్ ఆగ్రహంతో ఊగిపోయారు. స్టేడియంలో ఫ్లెక్సీలు చించి గ్రౌండ్‌లోకి కుర్చీలు, బాటిళ్లు విసిరేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బారికేడ్లు దాటి స్టేడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. అప్రమత్తమైన అధికారులు వారిని అడ్డుకున్నారు. స్టేడియం వద్ద భద్రతను పెంచారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ప్రభాకర్‌రావు కీలకంగా ఉన్నారు. ఆయనను విచారిస్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే నిన్న (శుక్రవారం) మొదటిరోజు రాత్రి వరకు ఆరున్నర గంటల పాటు ప్రభాకర్‌రావుని విచారించారు సిట్ అధికారులు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోనే రాత్రి పడుకున్నారు ప్రభాకర్‌రావు. అయితే, ఇవాళ (శనివారం) రెండోరోజు విచారణ ప్రారంభమైంది. ప్రభాకర్‌రావును పలు అంశాలపై విచారణ చేస్తున్నారు సిట్ అధికారులు. నిన్నటి విచారణలో ప్రభాకర్‌రావుకు సంబంధించిన ఐదు ఐ క్లౌడ్, ఐదు జీమెయిల్ ఖాతాల్లోని డేటాపై సిట్ అధికారులు ఫోకస్ పెట్టారు. గతంలో నాలుగు జీమెయిల్ ఖాతాలు, ఐక్లౌడ్‌కు సంబంధించిన రెండు ఖాతాల పాస్‌వర్డ్‌లను గుర్తించారు. ఈ ఖాతాల్లో కనిపించని డేటాను ఫోరెన్సిక్‌కు పంపించారు. ఫోరెన్సిక్ డేటా ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తున్నారు సిట్ అధికారులు. మరోవైపు.. సింక్ అయిన డేటా కోసం యాపిల్, జీమెయిల్ కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తున్నారు సిట్ అధికారులు. ఈ డేటాపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. అలాగే, విచారణలో ప్రభాకర్‌రావు నోరు విప్పితే కీలకమైన ఆధారాలు లభించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. తన వ్యక్తిగత సమాచారం మాత్రమే డివైస్ నుంచి తొలగించానని సిట్ అధికారులకు తెలిపారు ప్రభాకర్‌రావు.